ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శుక్రవారం 22 నవంబరు 2024





గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సీతక్క, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

భారతీయ జెండాతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా కానిస్టేబుళ్ల కవాతు

నీతి, నిజాయితీలే.. ఆభరణాలు

- ప్రజల్లో ధైర్యం నింపేలా పోలీసులు సేవలందించాలి
- రుద్రమదేవి వీరత్వం, సమ్మక్క-సారక్కల పోరాట తత్వం మహిళల్లో పెంపొందాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- మామునూరు పీటీసీలో అట్టహాసంగా కొనసాగిన దీక్షత్ పరేడ్
- విధులకు 1,148 మంది మహిళా కానిస్టేబుళ్లు

7



సెల్యూట్ చేస్తున్న మహిళా కానిస్టేబుల్

మామునూరు పోలీసు శిక్షణా కళాశాల (పీటీసీ) పులకించింది. పోలీసు ఉద్యోగం సాధించి కలలను సాకారం చేసుకుని విధులకు సిద్ధమైన మహిళా కానిస్టేబుళ్ల కవాతు, ప్రదర్శనలతో ఉప్పొంగింది. కొలువు సాధించిన తమ వారికి కుటుంబసభ్యులు ఇచ్చిన ఆత్మీయ ఆలింగనాలు.. కురిపించిన ఆనందం భాష్పాలు.. ప్రేమాభిమానాల జల్లుల్లో తడిసిముద్దయ్యింది. సంతోషకర క్షణాలకు వేదికైంది. గురువారం మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లోని పీటీసీలో తొమ్మిదినెలలపాటు శిక్షణ తీసుకున్న మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ పరేడ్ అట్టహాసంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అధ్యక్షతన జరిగిన దీక్షత్ పరేడ్ స్ఫూర్తిని నింపింది. వేడుకలకు హాజరైన మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరై.. పోలీసులకు నీతి, నిజాయితే ఆభరణాలని, మహిళా పోలీసులు వీర మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను అభినందించారు. అయితే తొమ్మిది నెలల పాటు సివిల్‌లో 843 మంది, ఏఆర్ విభాగంలో 305 మంది.. మొత్తం 1,148 మంది మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పొందారని ప్రిన్సిపాల్ పూజ వెల్లడించారు.

- మామునూరు (ఆంధ్రజ్యోతి)



కుటుంబ సభ్యుల ఆనందం

పోలీసులు ప్రజా సేవకు అంకితం కావాలి

వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మడికొండ సీటీసీలో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

7

మానుకోటలో లగచర్ల మంటలు!

- కేటీఆర్ నేతృత్వంలో మహాధర్నాకు బీఆర్ఎస్ సమాయత్తం
- పోలీసు అనుమతి నిరాకరణతో నాటకీయ పరిణామాలు
- ఉద్రిక్తత నేపథ్యంలో 144 సెక్షన్ అమలు
- పోలీసు వలయంలో జిల్లా కేంద్రం
- అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ ప్రెస్‌మీట్లతో వేడెక్కిన వాతావరణం

7లో



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలీసుల కవాతులో పాల్గొన్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

గ్రామీణాభివృద్ధికి మోదీ సర్కారు కృషి

- కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతి బాయి బంబానియా
- రేగొండ మండలంలో పర్యటన
- ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతి బాయి బంబానియా



మొక్కను నాటుతున్న కేంద్ర మంత్రి

రేగొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాల అభివృద్ధి మోదీ సర్కారు విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర వినియోగదారులు, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతి బాయి అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మండలంలో ఆమె గురువారం పర్యటించారు. రేగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు రూపిరెడ్డిపల్లిలోని రైతు సహకార సంఘం కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. రేగొండ పాఠశాలలో ఆమెకు విద్యార్థులు పరేడ్ చేస్తూ ఘన స్వాగతం పలికారు. తరగతుల గదులను పరిశీలించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. డిజిటల్ క్లాస్‌రూంను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 500 ఆస్పిరేషన్ బ్లాక్‌లను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి పాటుపడుతోందని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందని, మాతా శిశు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. మాతాశిశు మరణాలు నివారణలో భాగంగా గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలన్నారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేసి ప్రయోజనం పొందాలన్నారు. కేంద్ర సహాయ మంత్రి వెంట వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, డీఈవో రాజేందర్, డీఎస్పీ సంపత్‌రావు, తహసీల్దార్ శ్వేతారావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సీఐ మల్లేష్ యాదవ్, వైద్యాధికారి హిమబిందు, ఎస్సై సందీప్‌కుమార్ ఉన్నారు. ఆమెను బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, నాయకులు ప్రసాదరావు, తిరుపతిరావు, తిరుపతిరెడ్డి, గాలిఫ్ తదితరులు ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు.

కేంద్ర మంత్రిని కలిసిన నేతలు

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): రామప్ప దేవాలయ సందర్శనకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతి బాయి బంబానియాను బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంతోపాటు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, మండల అధ్యక్షుడు గాధం కుమార్, నాయకులు భూక్య జవహర్‌లాల్, పత్తి నాగేశ్వర్‌రావు, శరత్, రాయంచు నాగరాజు, మేరుగు కృష్ణమూర్తి, చాతరాజు విక్రాంత్, కుక్కల పవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మొద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి మండలం పంబాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపా లపల్లి మండలంలోని కమలాపూర్, నాగారం, ఆజాంన గర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, గొల్లబుద్దారం, నేరేడుపల్లి, వజినెపల్లి, గొర్లవీడు, కొంపల్లి, ఎస్ఎం కొత్త పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొందాల న్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. పేదలకు, రైతంగానికి మేలు చేయాలన్న ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సద్వినియోగం చేసుకోవాలి

గణపురం (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని బస్వరాజుపల్లి, పరుశురాంపల్లి, నగరంపల్లి, అప్పయ్యపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులకు న్యాయం చేయాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్లు గండ్ర సత్యనారాయణరెడ్డి, కన్నెబోయిన కుమార్, చోటెమియా, కట్ల మల్లయ్య, సుధాకర్, రాజు, సమ్మిరెడ్డి, నామాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఘనంగా పూజలు

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కార్తీక సందడి నెలకొంది. భక్తులు గురువారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా త్రివేణి సంగమం గోదావరి వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపుతో పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. శుభానందదేవి ఆలయంలో అమ్మవారికి కుంకమ పూజలు నిర్వహించారు.. సర స్వతిదేవి ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గులు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించి బ్రాహ్మ ణోత్తములను దీపాదానం అందజేశారు.

ఘనంగా దీపోత్సవం

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కాళేశ్వర దేవస్థానంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు టి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సామూహిక దీపోత్సవంలో మహిళలు పాల్గొన్నారు. వారికి దీపాలు, వత్తులు, నూనె, ఇతర పూజా సామగ్రిని ఆలయం నుంచే ఉచితంగా అందజేశారు. ఆలయ సూప రింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చక స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో సమగ్ర సర్వే పూర్తి

డేటా ఎంట్రీ ప్రారంభం



ములుగు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ములుగులో జిల్లాలో పూర్తయింది. తొమ్మిది మండలాల పరిధిలో 9,7552 కుటుంబాలను గుర్తించిన అధికారులు సర్వే కోసం 1,005 బ్లాక్‌లుగా విభజించారు. 713 మంది ఎన్యుమరేటర్లు, 74మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొన్నారు. వివరాల సేకరణ పూర్తయిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీని మొదలు పెట్టారు. ఈ ప్రక్రియను కలెక్టర్ దివాకర గురువారం పరిశీలిం చారు. సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని బాధ్యతాయుతంగా చేపట్టాలని ఆపరేటర్లకు సూచించారు. తప్పులు లేకుండా పక్కాగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రహీం, ఈడీఎం దేవేందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

క్రైం కార్నర్



బుచ్చయ్య (ఫైల్)

అప్పుల బాధతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

వాజేడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండ లంలోని కోయవీరాపురం గ్రామానికి చెందిన చాప బుచ్చయ్య (55) మండలంలోని పెదగొల్లగుడెం ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత, కుటుంబ అవసరాల నిమిత్తం తన పరిచయస్తుల వద్ద సుమారు రూ. 15 లక్షల అప్పు చేశాడు. అవి తీర్చలేకపోవడంతో అప్పు ఇచ్చిన వారి నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. దీంతో మనస్తాపం చెందిన బుచ్చయ్య బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన అనంతరం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న అతడిని స్థానికులు ఏటూరునాగారం వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. భార్య రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగుల కోసం చోరీలు

- చివరకు తన ఇంట్లోనూ దొంగతనం..
- అనుమానం రాకుండా ఉండేందుకు ఫిర్యాదు
- మైనర్‌ను అరెస్టు చేసిన పోలీసులు

గణపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులు, జల్సాలకు అలవాటు పడ్డ ఓ బాలుడు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. డబ్బుల కోసం తాను నివసిస్తున్న కాలనీలో పలువురి ఇళ్లల్లో చోరీలు చేశాడు. అంతేకాదు.. తన ఇంట్లోనూ దొంగతనం చేసి ఎవరికీ అనుమానం రాకుండా ఎంచక్కా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చివరకు ఇతర ఇళ్లతో పాటు అతడి ఇంట్లోనూ చోరీ చేసింది ఆ బాలుడే అని తేలడంతో పోలీసులు అరెస్టు చేశారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. సీఐ మల్లేష్ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. గణపురంలోని నాగవీధికి చెందిన ఎస్.కె.చోటేమియా, జానీ, మొయినొద్దీన్, సలీం, చాంద్‌పాషా, శైలజ, నరేష్ అనే వ్యక్తుల ఇళ్లల్లో 20 రోజుల వ్యవధిలో వరుస చోరీలు జరిగాయి. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇదే సమయంలో అదే కాలనీకి చెందిన ఓ 17ఏళ్ల వయసున్న బాలుడు తమ ఇంట్లోనూ చోరీ జరిగిందని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ వరుస దొంగతనాలపై పోలీసులు విచారణ జరుపుతుండగా.. స్థానిక ఓ అంగడి సమీపంలో సదరు బాలుడు తచ్చాడతుండగా.. అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో వరుస దొంతనాలకు పాల్పడుతున్నది తానేనని అంగీకరించాడు. అయితే ఆ బాలుడి తండ్రి బతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు వెళ్లగా తల్లి కుమారుడితో కలిసి సంచారజీవితం గడుపుతూ చిరువ్యాపారం చేసుకుంటూ ఉంటుంది. బడి మానేసిన ఆ బాలుడు జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడ్డాడు. డబ్బుల కోసం తాను నివాసం ఉండే కాలనీలోనే తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలు చేసేవాడు. అతడిని అరెస్టు చేసిన పోలీసులు రూ.5వేల నగదు, 25 తులాల వెండి స్వాధీనం చేసుకుని జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. మీడియా సమావేశంలో ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేలా చూస్తాం..



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న బూసాని వెంకటేశ్వర్‌రావు

- డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- ఉమ్మడి వరంగల్ నుంచి 105 వినతులు
- రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడి

7లో



సమావేశంలో మాట్లాడుతున్న భీమానాయక్

లంబాడా, గిరిజనులకు తీరని అన్యాయం

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్

నెహ్రూసెంటర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో భూములు కోల్పోయిన గిరిజనులకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానుకోటలో తలపెట్టిన నిరసన ధర్నాను అడ్డుకోవడమంటే ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవడమేనని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు భీమానాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని తన నివాస గృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణలో లంబాడ గిరిజనులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ తన ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లగచర్లలో గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ రాందాస్‌నాయక్, బాలునాయక్, చంద్రునాయక్, శంకర్‌నాయక్, కేవ్లానాయక్, రాంచందర్ నాయక్, శ్రీనునాయక్, భూక్య రవి, వీరన్న, మోహన్, బాబు, రవి పాల్గొన్నారు.

వన దేవతల స్ఫూర్తితో ఉద్యమించాలి

తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్

గోవిందరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్టీలలో వర్గీకరణ కోసం కమిషన్ వేసే వరకు ఆదివాసీలు సమ్మక్క-సారక్కల స్ఫూర్తితో ఉద్యమించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్‌లు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పస్రాలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 22,23తేదీల్లో ములుగు జిల్లాకేంద్రంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు.

ఈలోపు ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ కమిటీలను పూర్తి చేయాలని అన్నారు. ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీని రద్దు చేయడం జరిగిందని, నూతన కమిటీ ఏర్పాటు చేసేవరకు కన్వీనర్‌గా శిడం జంగుదేవ్, కోకన్వీనర్‌గా యాప అశోక్‌లు కొనసాగుతారని పేర్కొన్నారు. సమావేశంలో జాతీయ కోకన్వీనర్ పోడెం రత్నం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు, నాయకులు వట్టం కన్నయ్య, పూనెం బాలకృష్ణ, చింత కృష్ణ, శ్రీనివాస్, శ్రీను, వట్టం జనార్ధన్, చందా మహేష్, దుర్గారపు వీరభద్రం, చింత వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్

వర్గీకరణ అమలు కోసం పోరాటం

ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

కేసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీల వర్గీకరణను దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్నప్పటికీ దాని అమలు కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని మహజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. కేసముద్రంలో గురువారం ఆ పార్టీ సమావేశం ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంటిపూడి అరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్‌మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ తీర్పు వచ్చి నాలుగునెలలు గడుస్తున్నా అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. వచ్చేనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభకు ప్రతీ ఒక్క మాదిగ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు వేల్పుల సూరన్న, దుప్పెల్లి అనీల్‌కుమార్, పొలెపాక శంకర్, బీర్రు యుగెందర్, వల్లందాస్ రవికుమార్, జల్లె యాకాంబ్రం, కొమ్ము రాహుల్, మంద శ్రీను, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రంలో మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

ఎంఆర్‌పీఎస్ మండల కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షునిగా కొమ్ము నాగరాజు, అధికార ప్రతినిధిగా జల్లె అనీల్, ప్రధాన కార్యదర్శిగా జల్లంపల్లి ప్రవీణ్ తదితరులను ఎన్నుకున్నారు.



సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

బీఆర్ఎస్‌కు ప్రశ్నించే హక్కు లేదు

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

కురవి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరిట వందలాది ఎకరాల దళితుల భూములు లాక్కొని, నేడు నీతులు పలుకుతూ పోరాటాల పేరుతో హడావుడి చేయడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. కురవిలో గురువారం డోర్నకల్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం తురక రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కలెక్టరేట్‌లు, మెడికల్ కళాశాలలు, శ్మశాన వాటికలు, పల్లెప్రకృతి వనాల పేరుతో వందలాది ఎకరాల దళిత, గిరిజనుల భూములు లాక్కుని వారిని బజారున పడేసి నేడు ప్రేమ వలకబోయడం బీఆర్ఎస్ ద్వంద నీతికి నిదర్శనమన్నారు. దేశంలో వంద సంవత్సరాలు నిండబోతున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమేనని, పార్టీ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నెల్లూరి నాగేశ్వర్‌రావు, కర్నం రాజన్న, ఎం.బాలకృష్ణ, పోలెపాక వెంకన్న, దొంతు రామ్మూర్తి, రవి పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరికి జైలుశిక్ష

రూ.1200 జరిమానా ● తీర్పు వెల్లడించిన జడ్జి తిరుపతి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దాడి జరిగిన కేసులో ఓ వ్యక్తికి 15 నెలల పాటు జైలుశిక్ష, రూ.1200 జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి శుక్రవారం తీర్పు వెల్లడించారు. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. 2020లో మహబూబాబాద్ మండలం సికింద్రాబాద్ తండా శివారు కొల్లుగుంటితండాకు చెందిన భూక్య శ్రీను భూవివాదం కేసులో అదే తండాకు చెందిన గుగులోతు మంగమ్మను రాయితో తలపై కొట్టాడు. దీంతో మంగమ్మ తీవ్రంగా గాయపడింది.

మంగమ్మ కుమారుడు గుగులోత్ మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రమేష్‌బాబు కేసు నమోదు చేసి భూక్య శ్రీనును రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ జి.సురేష్ నిందితుడు భూక్య శ్రీనును కోర్టులో హాజరుపరచగా ఏపీపీ జె.లత వాదనలు వినిపించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి తిరుపతి నిందితుడు భూక్య శ్రీను 15 నెలల జైలుశిక్ష, రూ.1200 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించిన్నట్లు చెప్పారు.

జాతీయస్థాయి సదస్సును విజయవంతం చేయండి

గిరిజనాభ్యుదయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లింగయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందా లింగయ్యదొర

వెంకటాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం డివిజన్‌కేంద్రంలో డిసెంబరు 26 నుంచి 28 వరకు జరిగే ఆదివాసీ జాతీయస్థాయి సదస్సును విజయవంతం చేయాలని గిరిజనాభ్యుదయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చందా లింగయ్యదొర పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆదివాసీల హక్కుల కోసం, చట్టాల కోసం 1974లో జాతీయ ఆదివాసీ గిరిజన సంఘం ఏర్పడిందని అన్నారు. ఆసంఘం గోల్డెన్‌జూబ్లీ సందర్భంగా 26నుంచి 28వరకు ఉత్సవాలను ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాబోయేరోజుల్లో ప్రభుత్వం ఆదివాసీలకు మెరుగైన అభివృద్ధి కోసం తోడ్పడాలని కోరారు. ఈసమావేశంలో ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలెం కోటి, గోండ్వాన సంక్షేమపరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, నాయకులు పూనెం ప్రతాప్, గొగ్గుల ఆర్కే, నాగశంకర్, కొమరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వచ్చే డిసెంబర్‌లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఉన్న గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరుకావడానికి ఆసక్తి ఉన్న గిరిజన వర్కింగ్ జర్నలిస్టులు తమ పేర్లను సంబంధిత జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని వెంకటేశ్వర్‌రావు ఆ ప్రకటనలో తెలిపారు.

సీఎం కప్ పోటీలు నిర్వహించాలి

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి



హైదరాబాద్‌లో ప్రభుత్వ, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న ప్రతాప్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడలకు పుట్టినిల్లు మానుకోట జిల్లా కేంద్రంలో బాస్కెట్‌బాల్ సీఎం కప్ పోటీలను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ, ముఖ్యమంత్రి సలహాదారులు వేం.నరేందర్‌రెడ్డికి గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ మండలానికి అదనంగా మరో తహసీల్దార్‌ను నియమించాలని కోరారు. పెద్దమండలం కావడంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అదనంగా తహసీల్దార్‌ను నియమిస్తే మహబూబాబాద్ పట్టణానికి ఒకరు, రూరల్ గ్రామాలకు మరొకరికి బాధ్యతలు అప్పగిస్తే ఆయా పరిధిల్లో రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఎల్టి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్‌ను శుభ్రంగా ఉంచుకోవాలి

మెటర్నల్ చైల్డ్ ప్రోగ్రాం ఆఫీసర్ సారంగం

దంతాలపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్లను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మెటర్నల్ చైల్డ్ ప్రోగ్రాం ఆఫీసర్ సారంగం సూచించారు. గురువారం దంతాలపల్లిలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసిస్టు గది, లేబర్‌రూంతో పాటు వోపీ పరిస్థితిని పరిశీలించారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి, వారికి నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందించాలన్నారు. సబ్‌సెంటర్ వారీగా పూర్తిస్థాయి సమాచారాన్ని అందుబాటులో ఉంచి, సుఖ ప్రసవాల కోసం కృషి చేయాలన్నారు.

గర్భిణులకు సంబంధించిన వైద్యపరీక్షలు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. అత్యవసర కేసులను జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని ఆయన సూచించారు. పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. తేలుకాటు, పాముకాటుకు పీహెచ్‌సీలో నాణ్యమైన వైద్య అందుబాటులో ఉన్నట్లు ఏఎన్ఎంలతో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, సూపర్‌వైజర్లు సుజాత, ఫార్మసిస్టు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



రిజిష్టర్ తనిఖీ చేస్తున్న డాక్టర్ సారంగం



గజగజ..

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు, పెరుగుతున్న చలి
- పల్లెల్లో ఉదయం, సాయంత్రం చలిమంటలు
- వెలిసిన స్వెట్టర్ల షాపులు, పెరిగిన కొనుగోళ్లు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఎన్నడు లేని విధంగా చలి తీవ్రత పెరిగిపోయింది. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు చలితో గజగజ వణికిపోతున్నారు. జిల్లాలో ఎన్నడు లేని విధంగా క్రమక్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుతూ వస్తున్నాయి.

ఇటీవల కాలంలో ఈనెల 17న ఆదివారం రోజున కనిష్ట ఉష్ణోగ్రత 16.4, గరిష్ట ఉష్ణోగ్రత 35.3 డిగ్రీలు నమోదుకాగా, 18న సోమవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 14 డిగ్రీలకు పడిపోగా గరిష్ట ఉష్ణోగ్రత 34.7 డిగ్రీలు నమోదయ్యాయి. రెండు రోజుల తర్వాత తాజాగా గురువారం జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 12.1 డిగ్రీలకు పడిపోగా నమోదుకగా గరిష్ట ఉష్ణోగ్రత 33.1 డిగ్రీలు నమోదయ్యాయి.

దీంతో ఉదయం, రాత్రి వేళల్లో ప్రజలు స్వెట్టర్ (ఉన్ని దుస్తులు) ధరిస్తున్నారు. అంతే కాకుండా పల్లెలో చలితో వణికిపోతున్న ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో చలిమంటలు కాగుతున్నారు. ఉదయం వేళల్లో పొగమంచుతో ఎదురుగా వచ్చేవాహనాలు కన్పించకపోవడంతో లైట్లు వేసుకుని వెళ్తున్నారు. మానుకోట జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో స్వెట్టర్, రగ్గుల షాపులు వెలిశాయి.

చలి తీవ్రత పెరగడంతో ఉన్నిదుస్తులు కొనుగోళ్లు భారీగా పెరిగాయి. చలిని తట్టు కోవడానికి చిన్నారులు, వృద్ధులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఉదయం తెల్లవారుజామున, రాత్రి చీకటి పడ్డాక చలి తీవ్రత ఉండడంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ క్రమంలో రాత్రి వేళల్లో రోడ్లన్ని బోసిబోయి కన్పిస్తున్నాయి. అత్యవసర పనులపై బయటకు వస్తున్న వారు స్వెట్టర్, మంకి క్యాప్‌లు ధరిస్తున్నారు. మొత్తానికి చలి కాలంలో ఆరంభంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఇక డిసెంబరు, జనవరి మాసాల్లో చలి తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై కేసు

బాలసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మాజీ ఎమ్మెలే అజ్మీరా శంకర్‌నాయక్‌పై సుబేదారి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బుధవారం పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని పైడిపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన రుద్రోజ్ పద్మావతికి ఆమె తల్లిదండ్రులు హనుమకొండ న్యూశాయంపేట దుర్గాదేవి కాలనీలోని 186 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని పసుపు కుంకుమల కింద ఇచ్చారు. ఈ భూమిలో పద్మావతి ప్రహరీ, అందులో రెడిమేడ్ కంటైనర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు సమీపంలో భూమి ఉండడంతో పద్మావతి నిర్మించిన ప్రహరీని శంకర్‌నాయక్ అనుచరులు కూల్చివేసినట్లు తెలిపారు. తన భర్త సుగ్రీవాచారితో కలిసి పద్మావతి, ఈ నెల 16న కూల్చిన ప్రహరీని పరిశీలిస్తుండగా అక్కడ ఉన్న శంకర్ నాయక్ బంధువులు అజ్మీరా వెంకట్‌నాయక్, బానోత్ ప్రేమ్‌నాయక్, బానోత్ మోహన్‌లాల్ నాయక్ దాడి చేసినట్లు పద్మావతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు విమర్శించారు. మహబూబాబాద్ మండలానికి సంబంధించిన వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం అధికారంలోకి వచ్చారని చెప్పారు. అమలు కానీ హామీలు ఇచ్చి నేటికి ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళి, ఇందుభారతి, మారగాని రాజుగౌడ్, మల్లం యశ్వంత్, భూక్య హుస్సేన్, గోవర్ధన్, చుక్కల నరేష్, శ్రీనునాయక్, గణేష్, సుధాకర్, వినోద్ పాల్గొన్నారు.

కాళోజీ ఆరోగ్య విశ్వ విద్యాలయం వీసీ నియామకంపై తీవ్ర జాప్యం

వరంగల్ మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసి ఐదునెలలు గడుస్తున్నా ప్రభుత్వం వీసీ నియామకాన్ని మరిచినట్లు విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ కరుణాకర్‌రెడ్డిని ఉప కులపతిగా నియమించింది. నిబంధనల ప్రకారం మూడేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం వరుసగా పొడగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ వీసీగా డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఇంకా కొనసాగుతూనే ఉన్నారు.

ఈ విషయంపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు గత జూన్ 7న నూతన వీసీ నియామకం కోసం నోటిఫి కేషన్‌ను జారీచేశారు. అర్హులైన వారు దరఖాస్తులు కూడా సమర్పిం చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 33శాతం రిజర్వేషన్లు మహిళలకు ప్రకటించింది. ఇప్పటి వరకు పదికిపైగా ప్రకటించిన ఉప కులపతి నియామకాల్లో ఒక మహిళకు కూడా అవకాశం ఇవ్వనందున కాళోజీ ఆరోగ్య విశ్వవి ద్యాలయానికైనా మహిళా ఉపకులపతిని నియమించాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. బోధన అనుభవం పరిపాలన దక్షత కలిగిన మహిళను ఉప కులపతిగా నియమించాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



కల్యాణ్ (ఫైల్)

నెల్లికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని రాజుల కొత్తపెల్లిలో గురువారం జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. అవివాహితుడైన ఆకారపు కల్యాణ్ (25) మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది, ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఆకారపు వెంకటాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా కృష్ణమూర్తి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా మహబూబాబాద్ పట్టణానికి చెందిన విద్యావేత్త కమ్మగాని కృష్ణమూర్తి నియామకయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు గురువారం ప్రకటించి కమ్మగాని కృష్ణమూర్తికి నియామక పత్రాన్ని అందించారు. ప్రత్యేక తెలంగాణ, జిల్లా ఏర్పాటు ఉద్యమంలో కీలక భూమిక పోషించిన కృష్ణమూర్తి బీసీల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా అవకాశం కల్పించారు. తనపై నమ్మకంతో నియమించిన శంతన్‌రామారాజుకు కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంసీపీఐలో చేరికలు

కేసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండ శివారు మర్రితండాలో గురువారం ఎంసీపీఐ మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి, జాటోత్ బిచ్యానాయక్‌ల ఆధ్వర్యంలో 50 మంది ఆ పార్టీలో చేరారు. పేద, బడుగు, బలహీనవర్గాల కోసం పోరాడుతున్నందున పార్టీలో చేరుతున్నారని మర్రిపెల్లి మొగిలి అన్నారు. కార్యక్రమంలో వీ మొగిలి, శ్రీను, రాంజీ, వెంకన్న, బానోత్ శ్రీను, జాటోత్ వీరు, బోడ శంకర్, ఆంగోత్ బాపుసింగ్, మంగ్యా, రెడ్యా పాల్గొన్నారు.

గ్రూప్-4కు ఎంపికైన కొత్తదుబ్బతండా కార్యదర్శి లోకేష్

డోర్నకల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్తదుబ్బతండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుడిబోయిన లోకేష్ గ్రూప్-4కు ఎంపికయ్యాడు. మండలం మొగిలిచర్లకు చెందిన గుడిబోయిన లోకేష్ 2019లో నిర్వహించిన పోటీ పరీక్షల ద్వారా పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం పొందారు. ఇటీవల గ్రూప్-4 ఫలితాల్లో రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందిన లోకేష్‌ను మండలానికి చెందిన జీపీ కార్యదర్శులు అభినందించారు.

అర్చకుడికి మెమో జారీ

ఐనవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న అర్చకుడు నందనం మధు శర్మకు ఈవో మెమో జారీ చేశారు. ఈ నెల 17న లిక్కర్ వ్యాపారులైన మల్లన్న టీం సభ్యుల నుంచి ఎండోమెంట్ శాఖ అధికారుల అనుమతి లేకుండా అభివృద్ధి పనుల పేరిట రూ.1.50 లక్షల విలువ చేసే చెక్కును అర్చకుడు ఆలయ గర్భగుడిలో తీసుకున్నాడు. ఈ విషయంపై ఫిర్యాదులు అందడంతో ఈవో నాగేశ్వర్‌రావు గురువారం అర్చకుడికి మెమో జారీ చేశారు. అభివృద్ధి పేరిట భక్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నీతి, నిజాయితీలే ..

- ప్రజలకు ధైర్యం ఉండేలా సేవలందించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

పోలీసులకు ఆభరణాలు

- మామునూరు పీటీసీలో అట్టహాసంగా దీక్షత్ పరేడ్



పరేడ్ నిర్వహిస్తున్న ఎంపికైన కానిస్టేబుళ్లు

శంభునిపేట/మామునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీలే పోలీసు శాఖకు ఆభరణాలు అని, చిత్తశుద్ధితో పనిచేసిన వారికి సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రం సమీపంలోని మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో గల పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో గురువారం దీక్షత్ పరేడ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పీటీసీ ప్రిన్సిపాల్, ఎస్పీ ఇంజారపు పూజ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షత్ పరేడ్ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, ప్రత్యేక అతిథిగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. గ్రూపు కమాండింగ్ క్యాడెట్ ప్రద్యూష్న ఆధ్వర్యంలో మహిళా పోలీసు క్యాడెట్ల పరేడ్‌ను ఆసక్తిగా తిలకించి గౌరవ వందనం తీసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పోలీసులంటే ప్రజలకు ధైర్యం, నమ్మకం కలగాలని, అందుకు పోలీసు స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారికి సేవలందించాలని తెలిపారు. 800 ఏళ్ల కిందటే ఓరుగల్లు గడ్డపై రాణి రుద్రమదేవి, సమ్మక్క-సారలమ్మలను చూశామని, వారిని ఆదర్శంగా తీసుకొని పోలీసు శాఖలోకి వచ్చిన మహిళలు ప్రజలకు న్యాయం జరిగేలా రాజ్యాంగం ప్రకారం, మానవత్వంతో పనిచేయాలన్నారు. 9 నెలల ట్రైనింగ్ జీవితాంతం గుర్తుంటుందని తెలిపారు. మహిళా పోలీసులకు సమస్యలు వస్తే ట్రైనింగ్‌లో నేర్చుకున్న విషయాలను నెమరువేసుకోవాలని అన్నారు. నిత్యం వ్యాయామం, యోగా చేస్తూ ఫిట్‌నెస్‌ను కొనసాగించాలని సూచించారు. 2022 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని న్యాయపరమైన చిక్కులు తొలగించి ఫిబ్రవరిలో ట్రైనింగ్‌కు పంపేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఇంట్లో మహిళ చదువుకుంటే కుటుంబం మొత్తం బాగుపడుతుందని అన్నారు. ఆడపిల్లలను ప్రోత్సహించి పోలీసు శాఖకు పంపేందుకు నిర్ణయించుకున్న తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ మహిళలపై హింస తగ్గడం లేదని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తమను తాము రక్షించుకుంటూ సమాజంలోని మహిళలను కాపాడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. భౌతికంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకు తగిన వ్యాయామంతో పాటు నియమ నిబంధనలు పాటించాలన్నారు.

పీటీసీ ప్రిన్సిపాల్, ఎస్పీ ఇంజారపు పూజ మాట్లాడుతూ.. 9 నెలల పాటు శిక్షణ పొందిన సివిల్‌లో 843 మంది, ఏఆర్ విభాగంలో 305 మంది మొత్తం 1,148 మంది మహిళా కానిస్టేబుల్స్ పాసింగ్ పరేడ్‌లో పాల్గొని తమ శిక్షణను పూర్తి చేసుకున్నారని తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తేనే పోలీసు శాఖలో గుర్తింపు ఉంటుందన్నారు. పోలీసు కుటుంబాలుగా సమాజంలో ఒక ప్రత్యేక గౌరవాన్ని పొందాలన్నారు. ఉద్యోగంతో పాటు ఆర్థిక క్రమశిక్షణను పాటించాలన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్‌గా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు క్యాడెట్స్‌ను అభినందించారు. శిక్షణకు తోడ్పాటును అందించిన తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ మాధవికి మెడల్ అందజేస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎంపీ కావ్య

గ్రూప్-1 సాధించడమే లక్ష్యం



ఎం మాధవి (మాడుగుల, రాచకొండ కమిషనరేట్)

గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగంపై మచ్చికతో పోలీసు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నా. బీఫార్మసీ ద్వితీయ సంవత్సరంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. బీ ఫార్మసీ పూర్తి చేస్తాను. పీటీసీలో అందించిన శిక్షణ మరువలేను. సివిల్ కానిస్టేబుల్‌గా శిక్షణకు ఎంపికైన నేను బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. వ్యవసాయ కుటుంబంలో పుట్టాను. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ-కేశయ్యకు ఈ అవార్డు అంకితం చేస్తాను.

యూనిఫాంకు న్యాయం చేస్తా..



కె.మోనాలిక, హైదరాబాద్ (బెస్ట్ ఆల్‌రౌండర్ ఏఆర్)

పోలీసు యూనిఫాం మీద ఇష్టంతో పోలీసు శాఖలోకి వచ్చాను. డిగ్రీ పూర్తి చేయగానే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రజలకు న్యాయం చేయటం, రక్షణ కల్పించడమే ప్రథమ కర్తవ్యం. పీటీసీలో అధికారులు కుటుంబ సభ్యుల వలే చూసుకున్నారు. ఎస్ఐ జాబ్ కొట్టడం నా లక్ష్యం. ఏఆర్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా టాపర్‌గా నిలవడం పోలీసు శాఖలో నా తొలి విజయం.

అన్యాయాన్ని అరికట్టడమే లక్ష్యం



ఎం.డి. ఫాజియా, కానిస్టేబుల్, హైదరాబాద్

మా ఇంట్లో మేము ఐదు మంది అక్కాచెల్లెల్లం, ఒక తమ్ముడు ఉంటాం. సమాజంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలను కట్టడి చేయడానికే పోలీసు ఉద్యోగం సాధించాను. పోలీస్ ఉద్యోగం వల్ల మహిళలకు జరిగే అన్యాయాలను అరికట్టవచ్చు. పోలీసు కావడం చాలా సంతోషంగా ఉంది.

వెల్లివిరిసిన ఆనందం

మామునూరు పీటీసీకి తమ ఇంటి ఆడపిల్ల పోలీసు అయిందని సంబురం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కుటుంబ సభ్యులు మామునూరు పీటీసీకి తరలివచ్చారు. దీంతో పీటీసీలో పండుగ వాతావరణం కనిపించింది. తమ తల్లులు పోలీసులు అయ్యారని ఓ కూతురు, ఓ కుమారుడు పోలీసు యూనిఫామ్‌లో వచ్చి సెల్యూట్ చేశారు. తల్లికి తన టోపీని పెట్టి హత్తుకొని అభిమానాన్ని చాటారు. తల్లిదండ్రులతో యూనిఫామ్‌లో సెల్ఫీలు దిగి ఇంతకాలం దూరంగా ఉన్న కుటుంబసభ్యులను ఆలింగనం చేసుకొని ఆనందపడ్డారు. దీంతో పీటీసీ ప్రాంగణ మంతా ఆనంద భాష్పాలతో నిండిపోయింది.

ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు

ట్రైనింగ్‌తో పాటు పరేడ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి మంత్రి సీతక్క, ఎంపీ కావ్య, పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. ప్రతిభ కనబరిచిన బ్యాచ్ కమాండెంట్ ప్రద్యూష్న, ఎ.కుమారిలకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందించారు. కాగా, సివిల్ విభాగంలో ఉత్తమ ఆల్ రౌండర్, బెస్ట్ ఇండోర్‌గా మెట్టు మాధవి, బెస్ట్ అవుట్ డోర్, ఫైరర్‌లుగా ఎస్. స్వాతి, కందూరు శ్వేతలు పురస్కార విజేతలుగా నిలిచారు. ఏఆర్ విభాగంలో ఉత్తమ ఆల్ రౌండర్‌గా మోనాలిక, బెస్ట్ ఇండోర్, అవుట్‌డోర్, ఫైరర్లుగా సి.లావణ్య, కాట్రగడ్డ కీర్తి, అవంతిక విజేతలుగా నిలిచారు. వీరికి మంత్రి, ఎంపీ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.



హాజరైన అధికారులు



తమ పిల్లల పరేడ్‌ను సెల్‌లో బంధిస్తున్న తల్లిదండ్రులు



ప్రజా సేవకు అంకితం కావాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మడికొండ సీటీసీలో పీసీల పాసింగ్ అవుట్ పరేడ్

మడికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతలు పరిరక్షిస్తూ పోలీసు శాఖ కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా నిరంతరం ప్రజల సేవకు అంకితం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ట్రెయినీ కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. 9 నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 246 మంది స్టయిఫండరీ ట్రెయినీ కానిస్టేబుళ్ల (సివిల్) పాసింగ్ అవుట్ (దీక్షంత్) పరేడ్ మడికొండలోని సిటీ పోలీసు శిక్షణా కేంద్రం(సీటీసీ)లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లతో సీటీసీ ప్రిన్సిపాల్ రవి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది పోలీసులు మాత్రమేనని, శాంతి భద్రతలు పరిరక్షించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమన్నారు. ప్రజలతో స్నేహంగా ఉండాలన్నారు. ప్రతీ పోలీసుకు క్రమశిక్షణ ముఖ్యమని గుర్తుంచుకొని రాబోయే రోజుల్లో కూడా క్రమశిక్షణను అనుసరించాలని సూచించారు. నిత్యం విధి నిర్వహణలో ఎదుర య్యే పనిఒత్తిడితో పాటు ప్రతికూల పరిస్థితుల్లోనూ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని, ప్రలోభాలకు లొంగకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించే పోలీసులకు సమాజంలో గౌరవ మర్యాదలు పెరగడంతో పాటు అధికారుల గుర్తింపు ఉంటుందన్నారు. ఉన్నత చదువులు చదివి నైపుణ్యంతో పని చేయాలనుకున్న వారికి పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో పని చేసేం దుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. నూతన పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించడంతో పాటు కొత్త చట్టాలను సమర్థవంతంగా అమలు చేయా లన్నారు. తెలంగాణ పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావడానికి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు అంకిత భావంతో సేవలు అందిస్తూ వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సీటీసీ ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ట్రెయినీ కానిస్టేబుళ్లకు గత ఫిబ్రవరిలో ప్రారంభమైన తొమ్మిది నెలల శిక్షణ సమయంలో పరిపాలన, డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత, పోలీసు చట్టాలు, దర్యాప్తు, ఫోరెన్సిక్, మెడిసిన్, అవుట్ డోర్స్ ఫిజికల్ ట్రెయినింగ్, స్క్వాడ్ డ్రిల్, ఆర్మ్‌డ్రిల్, లాఠీ డ్రిల్, టియర్ గ్యాస్, మాబ్ ఆపరేషన్‌లు, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, ట్రాఫిక్, ఫస్ట్ ఎయిడ్, పోలీస్ అప్లికేషన్ల వినియోగం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చిన నాగరాజు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన రవి, శశిధర్‌గౌడ్‌లకు సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. కాగా, శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ అనంతరం తమ తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల చెంతకు చేరుకొని ఆనందాన్ని పంచుకున్నారు.

ట్రెయినీ కానిస్టేబుళ్లు తమ టోపీలను తమ వారికి పెట్టి ఆనందంతో మురిసిపోయారు. ఈసందర్భంగా పోలీసు శిక్షణ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఏసీపీలు తిరుమల్, సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐ ఉదయ్‌భాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్, స్వర్ణన్ రాజ్, ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, రవికుమార్, మంగీలాల్, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, ఇండోర్, అవుట్‌డోర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేలా చూస్తాం..

- డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ నుంచి 105 వినతులు



వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న అన్నపూర్ణ

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌పరంగా న్యాయం జరిగేలా చూస్తామని డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర్‌రావు స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు పేర్కొనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ మేరకు డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులు వివిధ కుల సంఘాల నుంచి 105 అభ్యర్థనలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా నుంచి 56, వరంగల్ జిల్లా నుంచి 16, భూపాలపల్లి జిల్లా నుంచి 8, ములుగు జిల్లా నుంచి 4, మహబూబాబాద్ జిల్లా నుంచి 6, జనగామ జిల్లా నుంచి 15 అభ్యర్థనలు వచ్చాయి. కాగా, 50శాతం బీసీ జనాభా ఉండగా 23శాతం మాత్రమే బీసీలకు రిజర్వేషన్లు ఉన్నాయని, బీసీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ పొలిటికల్ జాక్ జిల్లా చైర్మన్, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు తమ అభిప్రాయాన్ని తెలిపారు. తమిళనాడులో బీసీ వర్గీకరణ ద్వారా బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎంబీసీలు, సంచార జాతుల రాజకీయ వెనుకబాటుతనం ఆధారంగా స్థానికసంస్థల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేష తెలిపారు. గాండ్ల కులంలో రాజకీయంగా ఎదిగిన వారు లేరని, మహిళలకు రాజకీయ పరంగా అవకాశం కల్పించాలని, అలాగే గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గాండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ కమి షన్ చైర్మన్‌కు తమ అభిప్రాయాన్ని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ చెప్పారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా రజకులను ఎస్సీలుగా గుర్తించాలని తెలంగాణ రజక నవనిర్మాణ సంఘం అధ్యక్షుడు చీకటి రాజు కమిషన్‌కు వినతిపత్రాలు అందజేశారు. అలాగే పద్మశాలీ, యాదవ, దూదేకుల, ఫకీర్, విశ్వబ్రాహ్మణ, మేదరి, భట్టరాజు, మున్నూరుకాపుతో పాటు ఇతర బీసీ కులాల ప్రతినిధులు తమ కులాలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, రిజర్వేషన్ల శాతం పెంపుతో రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం తమ కులాలకు దక్కుతుందని కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు తమ అభిప్రాయాలను తెలిపారు. విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో తమకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని, రిజర్వేషన్ శాతాన్ని పెంచినట్లయితే తమ కులాలకు సరైన న్యాయం జరుగుతుందని, జనాభా దామాషా ప్రకారం తమ కులాలకు రిజర్వేషన్, ప్రభుత్వ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని వారు కమిషన్ చైర్మన్‌ను కోరారు.

అనంతరం డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు పేర్కొనే అంశంపై డెడికేటెడ్ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బహిరంగ విచారణ చేపట్టామన్నారు. ఈ బహిరంగ విచారణలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు, ఇతర కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల నుంచి అభిప్రాయాలు, విజ్ఞప్తులను స్వీకరించామని, ఈ అభ్యర్థనల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ బహిరంగ విచారణలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీ రమేష్, బీసీ సంక్షేమశాఖ హనుమకొండ జిల్లా డీడీ జి.రాంరెడ్డి, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, నరసింహస్వామి, రవీందర్ రెడ్డి, శైలజ, రవిందర్‌లు పాల్గొన్నారు.

సాంకేతిక పరిణతితోనే భవిష్యత్

హసన్‌పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిణతితోనే సమాజంలో ఇంజనీర్లకు భవిష్యత్ అని అల్ట్రాటెక్ సిమెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ వర్సిటీలో వీసీ దీపక్ గార్గ్ ఆధ్వర్యంలో గురువారం యంత్ర-24 ప్రాజెక్టు ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రస్తుత సమయంలో ఏఐ టెక్నాలజీ వివిధ ఇంజనీరింగ్ టెక్నాలజీలలో ఎలా ఉపయోగపడుతుందో ఉదాహరణలతో వివరించారు. అనంతరం ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎక్స్‌పోలో ప్రతిభను కనబర్చిన మెరుగైన అభిప్రాయలను వ్యక్త పరిచిన ఇంజనీరింగ్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, వీసీ దీపక్ గార్గ్, డీన్ ఫ్యాకల్టీ డాక్టర్ వి.మహేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఎక్స్‌పోను పరిశీలిస్తున్న ఎస్.శ్రీనివాసరావు



కేంద్ర సహాయ మంత్రి రామప్ప సందర్శన

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని కేంద్ర వినియోగదారులు, వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతి బాయి బంబా నియా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్. దివాకర ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనం తరం రామలింగేశ్వరస్వామిని మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అర్చకులు ఆమెను పట్టువస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. నీటిపై తేలియాడే ఇటుక, ఆలయ చరిత్ర, శిల్పసంపద విశి ష్టత గురించి గైడ్ కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రి వెంట ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ రవీందర్, తదితరులు ఉన్నారు.



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న నిముబెన్ జయంతి బాయి

మానుకోటలో.. లగచర్ల మంటలు!

- మహాధర్నాకు బీఆర్ఎస్ కార్యాచరణ
- పోలీసు అనుమతి నిరాకరణతో పరిణామాలు
- ఉద్రిక్తత నేపథ్యంలో144 సెక్షన్ అమలు
- పోటాపోటీ ప్రెస్ మీట్లతో వేడెక్కిన వాతావరణం

మహబూబాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాబల్య జిల్లా అయిన మహబూబాబాద్‌లో 'లగచర్ల ఫార్మా' మంటలు భగ్గుమన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా కంపెనీ నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన క్రమంలో అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, ఉన్నతాధికారులను గిరిజన రైతులు అడ్డుకున్న ఘటన సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అక్కడి గిరిజనులపై కేసులు పెట్టి, అరెస్టు చేసిన అంశాన్ని అస్త్రంగా మలచుకున్న బీఆర్ఎస్.. గిరిజనులపై కేసులు, అరెస్టులను ఖండిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నిరసన అంశాన్ని ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు.



మహబూబాబాద్ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కానీ ఆ ధర్నాకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంది. దీనికి తోడు గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ప్రాంతంలోనే క్లీన్‌స్వీప్ చేసిన కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేలు ఉండగా.. లగచర్ల విషయంలో కేటీఆర్ నిరసన కార్యక్ర మం విజయవంతమైతే హస్తం పార్టీకి నష్టం జరుగుతుందని భావించి కాబోలు కాంగ్రెస్ పెద్దలు హైదరాబాద్‌లో చక్రం తిప్పారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ వైఖరిపై మండిపడ్డారు. లగచర్ల ఘటనకు సూత్రదారి మాజీమంత్రి కేటీఆరేనంటూ విరుచుకుపట్టారు. ఆ వెంటనే పోటీగా బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కూడా విలేకరుల సమావేశం నిర్వహించి లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఇలా లగచర్ల ఘటన అంశంపై ఇరుపార్టీలకు చెందిన మానుకోట నేతల మధ్య జరిగి మాటల యుద్ధంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

బీఆర్ఎస్ నిరసనపై చివరి వరకు ఉత్కంఠ

కేటీఆర్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో లగచర్ల ఘటనపై నిరసన కార్యక్రమానికి అనుమతి విషయంలో చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. గురువారం జరిగే కేటీఆర్ నిరసన కార్యక్రమానికి అనుమతి కోసమని బీఆర్ఎస్ యువనేత యాళ్ల మురళీధర్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం దరఖాస్తు చేయగా.. అనుమతిస్తామంటూ పోలీసులు సాయంత్రం వరకు చెబుతూ వచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు పోలీసులు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్నలతో పాటు పలువురు ముఖ్యనేతలు నేరుగా ఎస్పీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు అనుమతి ఇస్తారని సుమారు రెండు గంటల పాటు వేచి చూసిన వారు.. జాప్యం వెనుక ఏదో జరుగుతుందని భావించి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు రాత్రి 8 గంటల నుంచి ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు రాత్రి 11గంటలకు నిరసనకు అనుమతి నిరాకరిస్తూ పోలీసులు బీఆర్ఎస్ నేతలకు నోటీస్ అందించారు.

ఎస్పీ క్యాంప్ ఆఫీస్ వద్ద హైడ్రామా..

అనుమతి విషయంలో పోలీసులు జాప్యాన్ని నిరసిస్తూ ఎస్పీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు నిరసనకు దిగడం హైడ్రామాకు తెరలేచింది. తొలుత బైఠాయించిన బీఆర్ఎస్ నేత.. ఆపై నిరసన నిద్రకు సిద్ధమయ్యారు. కానీ అప్పటికే అప్రమత్తమైన పోలీసులు సమీప పీఎస్‌ల పోలీసులను అక్కడికి రప్పించడంతో ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట ఉద్రిక్తత కొనసాగింది. ఒక దశలో బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. కానీ పోలీసులు సమన్వయంతో వ్యవహరించగా.. చివరికి సహనం కోల్పోయిన ఇద్దరు నేతలు నీళ్ల బాటిళ్లను పోలీస్‌స్టేషన్ గేటుపైకి విసిరారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య హుటాహుటిన అక్కడికి చేరుకుని నేతలతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు అక్కడ్నుంచి మదర్‌థెరిస్సా సెంటర్‌కు చేరుకుని కాసేపు ఆందోళన చేపట్టి నిష్క్రమించారు.

24 గంటల పాటు జిల్లాలో 144 సెక్షన్

కేటీఆర్ నిరసన ధర్నాకు అనుమతి నిరాకరణ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా 24గంటల పాటు 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేసి పెట్రోలింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారే సరికి భారీగా పోలీసులను రంగంలో దింపి జిల్లా కేంద్రంలో బందోబస్తు చేపట్టారు. ఇదే క్రమంలో గురువారం బీఆర్ఎస్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడితోనే కేటీఆర్ నిరసన కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదని విరుచుకుపడ్డారు. కేటీఆర్ ధర్నా అంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకంత భయం వేస్తుందంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం వరుస పరిణామాలను పరిశీలిస్తూ తదుపరి ఏం చేయాలనే అంశంపై పార్టీ ముఖ్యులు తర్జన.. భర్జనలు కొనసాగించారు.

25న నిరసనకు హైకోర్టు అనుమతి

లగచర్ల ఘటనను ఖండిస్తూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ నేతృత్వంలో మానుకోట పట్టణంలో ఈ నెల 25వ తేదీ సోమవారం శాంతియుతంగా ధర్నా నిర్వహించుకునేందుకు హైకోర్టు నుంచి అనుమతి లభించిందని బీఆర్ఎస్ మహబూబా బాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీఎంపీ మాలోతు కవిత వెల్లడిం చారు. గురువారం ఆమె మహబూబాబాద్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి జిల్లా కేం ద్రంలో గురువారం నిర్వహించతలపెట్టిన లగచర్ల ఘటనతో పాటు ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై నిరసన ధర్నా కార్యక్రమా నికి పోలీస్ అనుమతి రాకుండా నిరోధించిందని ఆరోపించారు. దీంతో తమ పార్టీ లీగల్ సెల్ హైకోర్టును ఆశ్రయించగా 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్నా నిర్వహణకు అనుమతిచ్చిందన్నారు.

పోలీస్ లోగోలో మార్పు



భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, ఆయా శాఖల కార్యాలయాలతోపాటు వాహనాల నంబ ర్‌ప్లేట్లపై ఉన్న 'టీఎస్' అనే పదాన్ని తొలగించిన విషయం విదితమే. వీటిలో కొన్నిటిని 'టీజీ'గా మార్చింది. మరికొన్నిట్లో 'తెలంగాణ' అని రాయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పోలీసు శాఖలో కూడా మార్పులు తీసుకొచ్చింది. 'తెలంగాణ పోలీస్' అని మార్చింది. దీంతో జిల్లాలో ప్రథమంగా భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన లోగోను మార్పు చేశారు. 'తెలంగాణ స్టేట్ పోలీస్' అని ఉన్న లోగో నుంచి 'స్టేట్‌ను తొలగించారు. కొత్తగా 'తెలంగాణ పోలీస్' అని ముద్రించారు. ఈ రాణాలోనే మొదటిసారిగా ప్రభుత్వ ఆదేశాలతో ఎఐ నరేష్‌కుమార్ నేతృత్వంలో ఈ మార్పుకు శ్రీకారం చుట్టారు. .

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



గణపురంలో మత్స్యకారుల జెండాను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

గణపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను నాయకులు ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య, నాయకులు చాడా కృష్ణస్వామి, కట్ల మల్లయ్య, వెంకన్న, గణపతి, రాజ్‌కుమార్, బాలకృష్ణ, శ్రీను, వంశీకృష్ణ, రాంచందర్ పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్‌లు ఘనంగా జరుపుకున్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి, మచ్చాపూర్ గ్రామాల్లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పులుగుజ్జు వెంకన్న జెండా విష్కరణలు చేశారు. మత్స్యకారులు సుమన్, మోటం సాంబయ్య, బండి సదయ్య, మల్లేశం, రేగుల లక్ష్మయ్య, కిరణ్, రమేష్, గోనెల రాజ్‌కుమార్, యాకయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం: మండలంలోని దేవాదుల, లక్ష్మీపురంలో మత్స్యకారుల దినోత్సవాన్ని ఓడబలిజ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు సర్వేష్, నరసింహరావు, వినోద్, రమాకాంత్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్, జిల్లా నాయకులు పిట్టల సారయ్య, సాదు చక్రపాణి, రంగరబోయిన జగదీశ్, రేసు సురేష్, రతన్, బుజ్జన్న, సారయ్య, పాండవుల సమ్మయ్య, సాయి, నరేష్, కిరణ్, రాజన్న, రవి, సతీష్, మహేందర్, సాయికిరణ్, రవీందర్, ఉపేందర్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల దినోత్సవాన్ని మండల కేంద్రంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏటూరునాగారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు భాస పుల్లయ్య, నకిరబోయిన రమేష్, చింతకింది రాజు తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఓడబలిజ సేవా సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జగన్నాథపురం, పేరూరులో మత్స్యకార జెండాను ఎగురవేశారు. సంఘం మండల అధ్యక్షుడు గార నాగార్జునరావు, ఉపాధ్యక్షుడు సుగంధపు సాంబశివరావు, నాయకులు బొల్లె ఆదినారాయణ, రొడ్డ అశోక్, ముత్తయ్య, మల్లికార్జునరావు, తోట నాగేష్, రొడ్డ డ్యాని, రాకేష్, వెంకటేష్, శ్రీశైలం, తేజ, అఖిల్, ప్రసాద్, సురేష్, మహేష్, రమేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్ కులస్థులు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ యువత జిల్లా ఉపాధ్యక్షుడు ముద్రవేణి సురేష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు కారుపాకల శంకర్, ఆకుల నర్సింగం, ఆకుల పర్వతాలు, గోస్కుల లక్ష్మయ్య, బోనగిరి రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజు, ఆకుల సతీష్, కుంట సదానందం, బోనగిరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 సర్వీసెస్ పరీక్ష కోసం జిల్లాలోని ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీయులు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి .రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబరు 2,3,9,10 తేదీల్లో రెండు ఫ్రీఫుల్ లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహించ నున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 9989661146 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మటన్ షాపులను తరలించాలి

భూపాలపల్లిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన మటన్, చికెన్ సెంటర్లను తరలించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు సీపీఐ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్, చంద్రమౌళి, శ్రీకాంత్, జోసెఫ్, రవి, రమేష్, తిరుపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు బీసీ సర్టిఫికెట్లను రద్దు చేయాలి'

కాటారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రెడ్డి గాండ్ల కులస్థులకు గతంలో జారీ చేసిన తప్పుడు బీసీ కుల ధ్రువీ కరణ పత్రాలను రద్దు చేయాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నిడిగొండ మైనర్ బాబు, అఖిల భారత యాదవ మహాసభ డివిజన్ అధ్యక్షుడు ఆత్మ కూరి స్వామియాదవ్, అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు విజ్జగిరి సమ్మయ్య కోరారు. హను మకొండ కలెక్టరేట్‌లో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలుగా గతంలో సర్టిఫికెట్లు తీసుకున్న రెడ్డిగాండ్ల కులస్థులను బీసీలుగా గుర్తించొద్దని కోరారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో పలు బీసీ కుల సంఘాల జిల్లా, మండల నేతలు తిరుపతి, మహేష్, వినోద్ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి రంగులు వేయాలి : దళిత సంఘాలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం, కమ్యూనిటీహాల్‌కు రంగులు వేయించాలని దళిత సంఘాల నాయకులు కలెక్టర్ దివాకరను కోరారు. ఈమేరకు గురువారం వారు కలెక్టర్‌ను కలిసి వివరించారు. ఈసందర్భంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు జన్ను రవి, అంబేద్కర్ భవన్, విగ్రహ నిర్మాణ సమితి జిల్లా చైర్మన్ నెమలి నర్సయ్య మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్ పరిసరాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం, మాదిగవాడ మలుపులో ప్రభుత్వం నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనానికి రంగులు వేయించాలన్నారు. ఈనెల 26న భారత రాజ్యాంగం అమలు దినోత్సవం జరుగనున్న నేపథ్యంలో దళితసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చుంచు రవి, దళిత సంఘాల నాయకులు మట్టెవాడ తిరుపతి, నద్దునూరి రమేష్, జన్ను దేవేందర్, ఓరుగంటి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మూడు ఆవుల మృత్యువాత

తాడ్వాయి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నర్సింగాపూర్ శివారులో నాగారం వైపు జాతీయ రహదారిపై పాలవ్యాను ఢీకొని మూడు ఆవులు మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం మేతకోసం అడవికి వెళ్లిన ఆవులు సాయంత్రం తిరిగి గ్రామంలోకి వస్తున్న క్రమంలో ఏటూరునాగారం వైపు వెళ్తున్న పాలవ్యాను ఢీకొట్టింది. ఈసంఘటనలో పిట్టల శంకర్, ధన, శ్రీనులకు చెందిన మూడు ఆవులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు రైతులకు చెందిన ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి.

ఏజెన్సీలో విద్యా వ్యవస్థను మెరుగుపరచాలి

వెంకటాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థను మెరుగుపరచాలని ఆదివాసీ సంక్షేమపరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తాటి రాంబాబు అధ్యక్షతన గురువారంజరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో అందరికీ నాణ్యమైన విద్యను అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయ కులు కుర్సం ముత్తయ్య, కుంజా సంతోష్, మడకం ప్రసాద్, సూరిబాబు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో మంటలు

మహదేవపూర్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబట్‌పల్లి అమరేశ్వరాలయ ఆవరణలోని హనుమాన్ ఆలయంలో గురువారం సాయంత్రం మం టలు చెలరేగాయి. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆలయంలోని హనుమాన్ విగ్రహం పూర్తిగా దగ్ధమైందని గ్రామస్థులు చెబుతున్నారు. ఆ వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనపై సీఐ రాంచందర్‌రావును వివరణ కోరగా ప్రమా దవశాత్తే జరిగే ఉంటుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. అయితే ఆలయంలో కేవలం విగ్రహానికి మాత్రమే మంటలు చెలరేగడంపై స్థానికుల్లో అనుమానాలు అను మానాలు వ్యక్తమవుతున్నాయి.

పిచ్చికుక్క దాడిలో బాలికకు గాయాలు

వాజేడు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో బాలికకు గాయాలైన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారి తోట నితీష సాయంత్రం ఇంటి సమీపంలో ఆడకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. అదే విధంగా మరో నలుగురిపై దాడి చేయబోగా కుక్కను గ్రామస్థులు తరిమేశారు. గాయపడ్డ బాలికను వాజేడు పీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందిస్తున్నారు. మండల వ్యాప్తంగా కుక్కల బెడద ఎక్కువగా ఉందని, రోడ్లపై తిరగాలంటేనే భయంగా ఉందని స్థానికులు అంటున్నారు. కుక్కలకు జబ్బు పట్టి తిరగటంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని, వాటిని నియంత్రించాలని కోరుతున్నారు.

న్యూస్ రీల్

ఆదివాసీల భూములకు పట్టాలివ్వాలి

• పెసా సమన్వయకర్త ప్రభాకర్

గోవిందరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లగూడెం గ్రామంలో రెవెన్యూ, ఫారెస్టు భూములను దశాబ్దాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్నారని, వాటికి పట్టాలివ్వాలని ఐటీడీఏ పెసా సమన్వయకర్త కొమురం ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండ లంలోని మొట్లగూడెం గ్రామంలో గురువారం పెసా గ్రామసభ జరగగా ఆయన మాట్లాడారు. 1965లో నిరుపేద ఆదివాసీ గిరిజనులకు ఆనాటి ప్రభుత్వం 90 ఎకరాలు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. వాటికి ఇప్పటి వరకు పట్టాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు ఆదివాసీలకు అందడంలేదని అన్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆదివాసీ రైతులకు పట్టాలు అందించాలని కోరారు. తహసీల్దార్ సృజన్ మాట్లాడుతూ భూమాత ద్వారా ఆదివాసీ రైతులకు పట్టాలు అందిస్తామని అన్నారు. అనంతరం ఎనిమిది అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామసభలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రభాకర్, గ్రామపెద్ద కొటి కృష్ణారావు, పెసా మొబిలైజర్ శశికుమార్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

ములుగు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ, సమాచారశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధానమైన విప్లవాత్మకశక్తిగా అవతరించిందని అన్నారు. ఇది పరిశోధనరంగంలో నూతన మార్గాలను తెరుస్తుందని, ఏఐ టూల్స్ ఉపయోగించడం ద్వారా పరిశోధన ప్రక్రియలు సులభతరం కావడమేకాకుండా పరిశోధనల నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందని అన్నారు. సదస్సులో డాక్టర్ బి.జగదీశ్, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

మహదేవపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజ రామయ్యర్ గత రెండు నెలల క్రితం స్వామి ఆలయంలో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ నేపథ్యంలో గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు దేవాలయ ప్రాంగణంలో పుట్బారు సిమెంటు రోడ్ల కోసం కొలతలు ప్రారంభించారు. పదిరోజుల క్రితం రోడ్ల విస్తరణ గురించి ఎస్టిమేట్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. గురువారం సీసీ రోడ్డు కొలతలను అధికారులు ప్రారంభించి పనులపై చర్చించారు.

ఓసీ పనులను అడ్డుకున్న గ్రామస్థులు

కాకతీయఖని, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2 పనులను సింగరేణి ప్రభావిత ప్రాంతం గడ్డిగానిపల్లి గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. గని ఆవరణలో టెంటు వేసుకుని బైఠాయించారు. ఓసీలో తమ ఇళ్లు, భూములను కోల్పోయామని, వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి సింగరేణి అధికారులు చేరుకుని యాజమాన్యం రూ.110 కోట్లు రెవెన్యూ డిపార్ట్‌మెంటుకు చెల్లించిందని తెలిపారు. దీనిపై ఏమన్నా అనుమానాలు ఉంటే ఆర్డీవో కార్యాలయంలో వాకబు చేసుకోవచ్చని నచ్చజెప్పారు. అయినా గ్రామస్థులు శాంతించకపోవడంతో తహసీల్దార్ శ్రీనివాసులు అక్కడికి చేరుకొని నష్టపరిహారం చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

టెక్నికల్ కోర్సు పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ కోర్సు పరీక్షలకు డిసెంబరు 3లోగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈవో రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, డ్రాయింగ్ హయ్యర్ గ్రేడ్‌కు రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్‌కు రూ.150, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ హయ్యర్ గ్రేడ్‌కు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అపరాధ రుసుంతో డిసెంబరు 17 వరకు గడువు ఉంటుందని తెలిపారు.

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

మహదేవపూర్ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి నిరోధకులైన మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలుంటాయని సీఐ రాంచందర్‌రావు అన్నారు. పలిమెల మండలంలోని మోదేడులో ఎస్సై తమాషారెడ్డితో కలిసి గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అటవీ జంతువులను వేటాడటం చట్టారీత్యా నేర మని అన్నారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సివిల్, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై దుష్ప్రచారం తగదు

మహదేవపూర్ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలపై దుష్ప్రచారం చేయడం తగదని ఆ పార్టీ పలిమెల మండల అధ్యక్షుడు గుండెబోయిన చిన్నన్న బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఎలిమెల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల కాలంలో పలిమెలకు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో యూత్ మండల అధ్యక్షుడు దందేరా రాజేందర్, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, కుమ్మరి మల్లయ్య, దాసరి రాజేష్, జయాకర్, రాజారామ్, సంతోష్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు ప్రారంభం



ర్యాలీలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కాకతీయఖని, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మూడో మహాసభలు గురువారం భూపాలపల్లిలో ప్రారంభమయ్యాయి. కృష్ణకాలనీలోని సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ అఖిలభారత కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కారల్ మార్క్స్‌కాలనీ నుంచి కృష్ణకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, సింగరేణి, జెన్కో ఆధారిత పరిశ్రమలైన బొగ్గు శుద్ధి కర్మాగారం, సిమెంటు ఫ్యాక్టరీ, ఎరువుల కర్మాగారం ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలను కల్పించాలన్నారు. పాత ఎర్ర జెరువులో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందేలా కృషి చేయాలన్నారు. సింగరేణి, జెన్కో, కాళేశ్వరం ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన వారికి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, రాజయ్య రమేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



రామ్మూర్తి మృతదేహం

వాజేడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి నీట మునిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురానికి చెందిన లొడిగె రామ్మూర్తి(56) అదే గ్రామా నికి చెందిన వాసం కృష్ణయ్య, మడే ధర్మరాజుతో కలిసి శివారులోని చెరువు వద్దకు గురువారం మధ్యాహ్న సమయంలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో రామ్మూర్తి చెరువులో నీటి లోతును అంచానా వేయలేక లోతుకు వెళ్లి నీట మునిగాడు. తోడుగా ఉన్న ఇద్దరు కుటుంబ సభ్యులకు సమా చారం ఇచ్చారు. చెరువులో వెతకగా మృతదేహం లభ్య మైంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



పవన్ (ఫైల్)

చిట్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన సుద్దపెల్లి పవన్ (24) గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పవన్ ఈనెల 11న వ్యవసాయ కూలీల కోసం కాల్వపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ శివారులో కల్వర్టు సమాపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయ పడిన అతడిని స్నేహితులు, కుటుంబ సభ్యులు హనుకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్న క్రమంలో పవన్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సుద్దపెల్లి రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి

కాటారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటుకుపల్లి అటవీ ప్రాంతం సమీపంలో కోళ్ల పందాల స్థావరంపై భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. పలువురు యువకులు కోడిపుంజులకు కత్తులు కట్టి పందెం ఆడుతుండగా చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. కోడి పందేలు ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్ తమ సిబ్బందితో గ్రామ పొలిమేరలో ఉన్న అటవీ ప్రాంతం బయట ఉన్న కోడి పందేల స్థావరాన్ని చుట్టుముట్టారు. దీంతో పలువురు పారిపోగా ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న వారిలో దామెరకుంట, కటుకుపల్లి, మల్లారం తదితర గ్రామాలకు చెందిన వారున్నారు. సంఘటన స్థలం నుంచి రూ.11 వేలు, 10 పందెం కోడిపుంజులు, వాటి కాళ్లకు కట్టే చుర కత్తులు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ తెలిపారు. కోడి పందేలు ఆడుతున్నవారిపై కేసు నమోదు చేసినట్లు కాటారం ఎస్సై అభినవ్ వెల్లడించారు.

ఏటూరునాగారంలో దొంగల హల్‌చల్

ఏటూరునాగారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఏటూరునాగారంలోని రామన్న గూడెం రోడ్డుకు మూడు బెల్ట్ షాపులు ఉన్నాయి. స్థానికుల, వ్యాపారుల కథనం మేరకు.. గురువారం తెల్లవారుజామున ఎవరూ లేని సమయంలో సుమారు నలుగురు దొంగలు షాపుల్లోకి చొరబడ్డారు. షాపుల్లోని వస్తువులు, మద్యం సీసాలను చోరీ చేయడానికి ప్రయత్నిస్తుండగా అదే సమయంలో వ్యాపారులు వారిని పసిగట్టి నలుగురిలో ఒకరిని పట్టుకున్నారు. మిగతా దొంగలు అక్కడి నుంచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. చోరీకి పాల్పడ్డ వ్యక్తిని షాపుల యజమానులు స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు



కాటారంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న హెచ్ఎంలు

భూపాలపల్లిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో గురువారం చెకుముకి పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గురుకులం విభాగంలో మైనారిటీ పాఠశాల, ప్రైవేటు విభాగంలో మాంటిస్సోరీ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ విభాగంలో భూపాలపల్లి పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, జేవీవీ సీనియర్ నాయకులు బానోతు సేవానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు, మండల కోకన్వీనర్ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి మండల స్థాయి పోటీలు జరిగాయి. జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఉమారాణి, జనవి జ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ బొట్ల కుమార్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ శ్రీధర్ టెస్టును నిర్వహించారు. మండల స్థాయిలో వివిధ పాఠశాల విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన చింతకాని జడ్పీహెచ్ఎస్, కాటారం గిరిజన సంక్షేమ బాలికల గురుకులం, కేంబ్రిడ్జి స్కూల్ విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు హట్కర్ సమ్మయ్య, ముక్లోత్ కిషన్‌నాయక్, గండు రాజబాబు, రవీందర్, అర్జున్ తదితరులు ఉన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిక పోటీలకు జిల్లా పరిషత్ పాఠశాల విభాగం నుంచి రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఎ.హాసిని, జి. రక్షితతో పాటు ప్రైవేట్ పాఠశాల విభాగం నుంచి సీఎస్ఐ పాఠశాలకు చెందిన వి.ప్రణతి, ఎ. రాజేశ్వరి, ఎ. కార్తీక్, రెసిడెన్షియల్ పాఠశాల విభాగం నుంచి ఆకులవారిఘణపురం ఆశ్రమ పాఠశాలకు చెందిన పి. రిషిత, బి. రిషిక విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి కె. మల్లయ్య హాజరయ్యారు. ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు కొర్ర రాజన్న, చెకుముకి జిల్లా కన్వీనర్‌లు పల్లె నాగరాజు, పొడెం సమ్మయ్య, ప్రతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ఇంగ్లిష్‌మీడియంలో వెంకటాపూర్ జడ్పీహెచ్ఎస్, తెలుగు మీడియంలో నల్లగుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా ప్రైవేట్‌స్కూల్ విభాగంలో లక్ష్మీదేవిపేటలోని అమరావతి హైస్కూల్ విద్యార్థులు, రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో వెంకటాపూర్ ఎంజేపీ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి) : చెకుముకి మండల స్థాయి పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జూకల్లు పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎలబద్రి సంకల్పిత, జంబుల సౌమిత్, డబ్బాల సాత్విక్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల కన్వీనర్ సూదం సాంబమూర్తి తెలిపారు. ఎంపీడీవో హేమ, ఎంఈవో కోడెపాక రఘుపతి, రెండో ఎస్సై షాఖాన్ ప్రథమ స్థానం సాధించిన జూకల్లు ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, శ్రీవివేకానంద పాఠశాలల విద్యార్థులకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీవో రామకృష్ణ, మండల నోడల్ ఆఫీసర్ గిరగాని కృష్ణ, ఉపాధ్యాయులు రాజమౌళి, సరళాదేవి, బుర్ర సదయ్య, నీలిమారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఎంఈవో రేగా కేశవరావు అధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి పోటీలు జరిగాయి. ఈ పరీక్షలు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కేశవరావు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాపారావు, మమత, రజిత, శంకర్, శ్రీనివాస్, చంద్రమౌళి, ఎమ్డీ.రహీం, అశోక్, యుగంధర్, భుజంగరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వాజేడ (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చూపారు. మూడు విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వాజేడు పాఠశాల విద్యార్థిని ఆర్.రోష్నీ, కేజీబీవీ పాఠశాల విద్యార్థిని టి. జ్యోత్షవి, ఏహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి ఎస్.కె.సలానీబాబు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులు ఎంఈవో తెజావత్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం సోయం ఆనందరావు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం విభాగం నుంచి జడ్పీహెచ్ఎస్ సూరారం, విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ తెలుగు మీడియం నుంచి జడ్పీహెచ్ఎస్ కాళేశ్వరం జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా ప్రైవేటు విభాగం నుంచి గ్రీన్‌వుడ్ హైస్కూల్ మహదేవపూర్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విజేతలకు మహదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామచందర్‌రావు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమం చెకుముకి మండల కన్వీనర్ బి.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. విశిష్ట అతిథిగా మండల విద్యాధికారి బి.ప్రకాశ్‌బాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాలుర ప్రధానోపాధ్యాయులు బి.రాజిరెడ్డి, బాలికల ప్రధానోపాధ్యా యురాలు పి.సరిత, ఉపాధ్యాయులు సూరారం నుంచి రంగారావు, బొమ్మాపూర్ నుంచి భాస్కర్, రాజబాబు, బాలికల స్కూల్ నుంచి మధు, కాళేశ్వర్ నుంచి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.